సాక్షి విశాఖపట్నం

గురువారం, 17, జూలై, 2025



మరో ఇద్దరు కంబోడియా ఏజెంట్లు అరెస్ట్ 8లో



ఎయిర్‌పోర్టులో ఉత్కంఠగా మాక్‌డ్రిల్ 8లో



మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం 8లో

ఫిరాయింపు కార్పొరేటర్లకు షాక్!



- పార్టీ ఫిరాయించిన 27 మంది వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు
- విప్ ధిక్కరించి 'మేయర్' అవిశ్వాసంలో కూటమికి ఓటు
- వైఎస్సార్ సీపీ ఫిర్యాదుకు స్పందించని ఎన్నికల అధికారి
- హైకోర్టును ఆశ్రయించడంతో ఎట్టకేలకు నోటీసుల జారీ



ఫిరాయింపు కార్పొరేటర్లపై చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంతో తైనాల(ఫైల్)

డాబాగార్డెన్స్: వైఎస్సార్ సీపీ గుర్తుపై పోటీ చేసి విజయం సాధించారు. స్వార్థ రాజకీయాలు, డబ్బులకు ఆశపడి 27 మంది కార్పొరేటర్లు పార్టీ ఫిరాయించారు. పార్టీ విప్‌ను ధిక్కరించి మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటు వేశారు. ఇప్పుడు ఆ 27 మంది కార్పొరేటర్ల రాజకీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఈ వ్యవహారంపై వైఎస్సార్ సీపీ హైకోర్టును ఆశ్రయించడంతో.. ఎన్నికల అధికారి ఎట్టకేలకు ఆ 27 మందికి నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేయడంతో ఫిరాయింపు కార్పొరేటర్లలో ఆందోళన మొదలైంది.

అసలేం జరిగిందంటే..: 2021లో జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో 98 వార్డులకు గాను 59 స్థానాలను వైఎస్సార్ సీపీ గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ సాధించింది. టీడీపీ 29, జనసేన 3 స్థానాలతో పాటు స్వతంత్రులు గెలిచారు. బీసీ జనరల్‌కు రిజర్వ్ అయిన మేయర్ పదవిలో యాదవ సామాజిక వర్గానికి చెందిన గొలగాని హరి వెంకటకుమారిని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో జీవీఎంసీని కైవసం చేసుకునేందుకు టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి పావులు కదిపింది. మెజారిటీ లేనప్పటికీ వైఎస్సార్ సీపీకి చెందిన 27 మంది కార్పొరేటర్లను డబ్బు, పదవుల ఆశ చూపి తమ వైపు తిప్పుకుంది. వీరిలో కొంత మంది టీడీపీ, మరికొందరు జనసేనలో చేరారు. ఈ ఏడాది ఏప్రిల్ 19న మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై జరిగిన ఓటింగ్‌లో.. ఈ 27 మంది కార్పొరేటర్లు వైఎస్సార్ సీపీ జారీ చేసిన విప్‌ను ధిక్కరించారు. మేయర్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు.

చట్టపరమైన పోరాటం

పార్టీ ఆదేశాలను ధిక్కరించిన కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ విప్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తైనాల విజయ్‌కుమార్ ఏప్రిల్ 22న జిల్లా ఎన్నికల అధికారి, అప్పటి జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. 2008 మున్సిపల్ కార్పొరేషన్ చట్టంలోని రూల్ నం.9 ప్రకారం, పార్టీ గుర్తుపై గెలిచిన సభ్యులు విప్‌ను ధిక్కరిస్తే వారి సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం ఉంటుందని అందులో పేర్కొన్నారు. అయితే వారం రోజుల్లోగా వారికి ఇవ్వాల్సిన నోటీసులు జారీ కాలేదు. మరోవైపు మేయర్ ఎన్నిక సమయంలో కౌన్సిల్ సమావేశ మినిట్స్ కాపీని ఇవ్వాలని వైఎస్సార్ సీపీ రెండుసార్లు కోరినా ఎన్నికల అధికారి స్పందించలేదు.

నోటీసులు అందుకున్న కార్పొరేటర్లు వీరే..

ముత్తంశెట్టి ప్రియాంక (6వ వార్డు), లొడగల అప్పారావు (8వ వార్డు), కెల్ల సునీత (13వ వార్డు), గేదెల లావణ్య (17వ వార్డు), గుడ్ల విజయసాయి (23వ వార్డు), సారిపల్లి గోవింద రాజుల వెంకట అప్పారావు(25వ వార్డు), ఉరుకూటి నారాయణరావు (29వ వార్డు), కోడూరు అప్పలరత్నం(30వ వార్డు), మాసిపోగు మేరీ జోన్స్(36వ వార్డు), ఆళ్ల లీలావతి (42వ వార్డు), పెద్దిరెడ్డి ఉషశ్రీ (43వ వార్డు), కంపా హనోక్ (45వ వార్డు), కంటిపాము కామేశ్వరి (47వ వార్డు), చల్లా రజని (54వ వార్డు), ముర్రు వాణి (57వ వార్డు), పుర్రె పూర్ణశ్రీ (59వ వార్డు), కొణతాల సుధ (61వ వార్డు), బొడ్డు నరసింహపాత్రుడు (65వ వార్డు), రాజానా రామారావు (71వ వార్డు), తిప్పల వంశీరెడ్డి (74వ వార్డు), బట్టు సూర్యకుమారి (77వ వార్డు), కొణతాల నీలిమ (80వ వార్డు), పీలా లక్ష్మీ సౌజన్య(81వ వార్డు), ఇల్లపు వరలక్ష్మి (85వ వార్డు), కుంచె జ్యోత్స్న (91వ వార్డు), బెహరా వెంకట స్వర్ణలత శ్రీదేవి (92వ వార్డు), ముమ్మన దేముడు (95వ వార్డు).

దీనిపై తైనాల ఈ నెల 9న హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం జరిగిన విచారణలో 'కార్పొరేటర్లకు నోటీసులు జారీ చేశారా?' అని న్యాయస్థానం ప్రశ్నించింది. దీనికి సమాధానంగా రెండు రోజుల కిందటే నోటీసులు ఇచ్చామని ఎన్నికల అధికారి తెలిపారు. కార్పొరేటర్లు ఇచ్చే సమాధానం ఆధారంగా పూర్తిస్థాయి నివేదిక అందజేస్తామన్నారు.

వ్యవహారాలన్నీ వికాస్ ద్వారానే..



ఎమ్మెల్యే ఆదేశాలతో చక్కబెడుతున్న డాక్యుమెంట్ రైటర్

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ హల్‌చల్
- రేవళ్లపాలెం భూకబ్జాలోనూ ఆయన హస్తమే
- వికాస్‌ను విచారిస్తే కూటమి ఎమ్మెల్యే పాత్ర బయటపడే అవకాశం
- గతంలోనూ అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్న ముఠా

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

అక్రమంగా భూములను ఆక్రమించడం.. తప్పుడు రికార్డులను సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకోవడం.. వెనువెంటనే విక్రయించడంలో అందెవేసిన చేయిగా ఉన్న కూటమి ఎమ్మెల్యే వ్యవహారాలన్నీ డాక్యుమెంట్ రైటర్ ద్వారా నడుస్తున్నట్టు తెలుస్తోంది. వికాస్ అనే సదరు డాక్యుమెంట్ రైటర్ ద్వారానే తాజాగా మధురవాడ రేవళ్లపాలెంలోని సర్వే నెంబరు 203/14ఏ కు చెందిన భూ వ్యవహారాలను నడిపినట్టు స్పష్టమవుతోంది. ఎమ్మెల్యే చెప్పారంటూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సదరు డాక్యుమెంట్ రైటరే చక్రం తిప్పుతున్నట్టు సమాచారం. ఒకవేళ పనికాకపోతే నేరుగా సదరు ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ చేసి కూడా ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. దీంతో అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గి పనులు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా లిటిగేషన్లు ఉన్న భూములకు సంబంధించిన సమాచారం సదరు డాక్యుమెంట్ రైటర్ ద్వారానే ఎమ్మెల్యే సేకరిస్తున్నారనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో డాక్యుమెంట్ రైటర్ వికాస్‌ను విచారిస్తే కూటమి ఎమ్మెల్యే పాత్ర బయటపడే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ దిశగా పోలీసులు విచారించడంలేదనే విమర్శలూ వినిపిస్తున్నాయి.

గతంలోనూ ఇదే దందా...!

వాస్తవానికి రేవళ్లపాలెంలోని సర్వే నెంబరు 203/14ఏ కు చెందిన భూకబ్జా వ్యవహారంలో అరెస్టయిన బెవర అనిల్, వెంకటేష్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు గల ముఠా మొదటి నుంచీ ఇదే పద్ధతిలో అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారాలను నడిపించేవారు. ఈ ముఠా గతంలోనూ అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారాలు చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. ఇందుకోసం నకిలీ పాసుపుస్తకాలు, అడంగల్, ఎఫ్‌ఎంబీలను తమ వద్ద ఉంచుకున్నట్టు తెలుస్తోంది. ఈ ముఠా ఇదే రేవళ్లపాలెంలోని సర్వే నెంబరు 201–11ఏ, 201–11బీలోని 1,522 చదరపు గజాల స్థలం కూడా తమకు వారసత్వంగా వచ్చిందంటూ నకిలీ రికార్డులను సృష్టించారు. దీనిని తమ కుటుంబ సభ్యులు ఐదుగురం సమానంగా విభజించుకుంటున్నామని రిజిస్ట్రేషన్ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా లెక్కిస్తేనే ఏకంగా రూ.5 కోట్ల వరకూ ఉంటుంది. ఇక మార్కెట్ ధరతో లెక్కిస్తే దీని విలువ రూ.10 కోట్లకుపైగానే ఉంటుంది. ఈ ఆస్తిని కూడా 2025 జనవరి 10వ తేదీన మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరిగింది. దీనిపై అసలు యజమాని ఫిర్యాదు చేయడంతో చివరకు ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు. ఇదే ముఠా గత మే నెలలో రేవళ్లపాలెంలోని సర్వే నెంబరు 203/14ఏలోని 1572.66 గజాలను ఏకంగా విక్రయించింది. ఈ రెండు వ్యవహారాల్లోనూ కూటమి ఎమ్మెల్యే పాత్ర ఉందనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారాలన్నీ సదరు డాక్యుమెంట్ రైటర్ వికాస్ ద్వారానే నడిపించినట్టు విమర్శలున్నాయి. అయితే సదరు డాక్యుమెంట్ రైటర్ జోలికి మాత్రం పోలీసులు వెళ్లకపోవడం పట్ల అనుమానాలు కలుగుతున్నాయి. అతడిని విచారిస్తే కూటమి ఎమ్మెల్యే పాత్ర బయటకు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ప్రైవేటు సర్వే ద్వారా..!

వాస్తవానికి ఫలానా ఆస్తి వీరిదే అనే వివరాలను రెవెన్యూ శాఖ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఈ ముఠా సభ్యులు ఆస్తిని విక్రయించాల్సిన సందర్భంలో ప్రైవేటు సర్వే ఏజెన్సీ ద్వారా నివేదిక తీసుకుని సమర్పిస్తున్నారు. దీని ఆధారంగానే రిజిస్ట్రేషన్ వ్యవహారాలను నడిపిస్తున్నారు. మొన్న రేవళ్లపాలెంలో 202, 203/14ఏలోని 1566.72 గజాల స్థలం విక్రయంతో పాటు 2025 జనవరిలో రిజిస్ట్రేషన్ చేసి.. ఆ తర్వాత రద్దు చేసిన వ్యవహారంలోనూ (201–11ఏ, 11బీ) సర్వే నివేదిక ఇచ్చిన ఏజెన్సీ ఒక్కటే. శ్రీ ఆదిత్య జియో టెక్ అనే సంస్థ ద్వారా సర్వే నివేదిక సమర్పించి పనికానిచ్చుకోవడం గమనార్హం. ఇటువంటి ప్రైవేటు సర్వే ఏజెన్సీల పనితీరుపై కలెక్టర్, జేసీ దృష్టి సారించడంతో పాటు వీటి నివేదికలకు విలువ లేదనే విషయాన్ని కూడా అధికారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు



తాటిచెట్లపాలెం : విశాఖపట్నం–కిరండూల్ రైళ్లు భద్రతా పనుల నిమిత్తం ఆయా తేదీల్లో కోరాపుట్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 17, 18వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ స్టేషన్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 17, 18వ తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం (58502) పాసింజర్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. అలాగే ఈ నెల 17, 18వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు కిరండూల్– విశాఖపట్నం (18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

రక్షణ మంత్రి పర్యటన రద్దు

విశాఖ సిటీ: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విశాఖ పర్యటన రద్దయింది. వాస్తవానికి గురు, శుక్రవారాల్లో ఆయన నగర పర్యటన ఖరారైంది. ఈ నెల 18న నేవల్ డాక్‌యార్డులో జరగనున్న నిస్తార్ నౌక జల ప్రవేశ కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉంది. కానీ అనివార్య కారణాల వల్ల విశాఖ పర్యటన రద్దయినట్లు అధికారులకు సమాచారం అందింది.

నేడు రక్షణ శాఖ సహాయ మంత్రి రాక

కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేత్ గురువారం విశాఖ రానున్నారు. రాత్రి తూర్పు నావికాదళం అతిథి గృహంలో బస చేస్తారు. ఆ తర్వాత రోజు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కూటమి 'మాస్టర్‌ప్లాన్'

- సలహాలు, సూచనలు, అభ్యంతరాలు ఇచ్చిన వారంతా కూటమి నేతలే..
- వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్–2041 పునఃపరిశీలనలో గూడుపుఠాణి
- ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు కలరింగ్
- చాలా ప్రాంతాల్లో ప్రతిపాదిత రహదారులు కుదించాలని కూటమి విజ్ఞప్తులు
- ఇష్టానుసారంగా బృహత్ ప్రణాళికలో సవరణలకు ఎత్తుగడ



విశాఖ సిటీ : సలహాలు ఇచ్చేది వాళ్లే. సూచనలు చేసేది వాళ్లే. అభ్యంతరాలు తెలిపేది వాళ్లే. సవరణలను ప్రతిపాదించేది వాళ్లే. నాలుగు గోడల మధ్య ఏసీ సమావేశ మందిరంలో కూటమి 'మాస్టర్ ప్లాన్' వేస్తోంది. వీఎంఆర్‌డీఏ బృహత్ ప్రణాళిక–2041లో ఇష్టానుసార సవరణలకు గూడుపుఠాణి చేస్తోంది. అయిపోయిన పెళ్లికి మళ్లీ బాజాలు అన్నట్లు.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సిద్ధమైన మాస్టర్‌ప్లాన్ పునఃపరిశీలనకు కూటమి ప్రభుత్వం పూనుకుంది. శాస్త్రీయంగా జరగాల్సిన ప్రక్రియను కూటమి నేతల సమక్షంలోనే మమా అనిపించేయాలని చూస్తోంది. అందుకు బుధవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో జరిగిన తంతే నిదర్శనం. మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాలు ఉంటే వీఎంఆర్‌డీఏ మూడో అంతస్తులో ఉన్న సమావేశ మందిరానికి వచ్చి చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌కు తెలియజేయాలని ప్రకటించారు. అయితే ఈ కార్యక్రమంలో కూటమి ప్రజాప్రతినిధులు, నేతలు, వారి అనుచరుల హడావుడే కనిపించింది. ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పి.. కూటమి ప్రజాప్రతినిధులు, నేతల రియల్ వ్యాపారాలకు లబ్ధి చేకూరేలా ఇష్టానుసారంగా మార్పులు, చేర్పులకు ప్లాన్ వేసుకున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రహదారులను విస్తరించడానికి మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేస్తుంటారు. కానీ ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రహదారులను కుదించడానికి ఎక్కువగా విజ్ఞప్తులు రావడం గమనార్హం. భవిష్యత్తులో అవసరమైన ప్రాంతాల్లో రహదారులను కుదించాలని, వ్యాపారాలకు అనువైన ప్రాంతాల్లో విస్తరణకు ప్రతిపాదించడం ఇక్కడ విశేషం. వారే సలహాలు, సూచనలు, అభ్యంతరాలు తెలుపుతూ సవరణలకు చేయాలని అధికారులకు వినతులు అందజేశారు. ఈ బృహత్ ప్రణాళికపై సలహాలు, సూచనల స్వీకరణకు అనూహ్య స్పందన వచ్చిందని చెప్పడం కొసమెరుపు.

కూటమి చేసిన వినతులు

- రుషికొండ సర్వే నెంబర్ 25లో ఏ1 గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్ వద్ద ప్రతిపాదిత 60 మీటర్ల రహదారిని, డివైడర్ నుంచి ఇరువైపులా 30 మీటర్లు ఉండే విధంగా మాత్రమే అలైన్మెంట్ ఉండాలి.
- దసపల్లా హిల్స్ సర్వే నెంబర్ 1196లో నౌరోజీ రోడ్ నుంచి వాల్తేరు మెయిన్ రోడ్డుకు కలిపే రహదారి విస్తరణ ప్రస్తుతం నిలిపివేయాలి.
- నిడిగట్టు గ్రామంలో ప్రతిపాదిత 24 మీటర్ల రహదారి నిర్మాణం వద్దు.
- నేరెళ్ల వలస రెవెన్యూ గ్రామంలో ఎస్‌టీఎస్ వద్ద ప్రతిపాదిత 70 మీటర్ల రహదారి అలైన్మెంట్‌ను మార్పు చేయాలి.
- సర్వే నెంబర్ 101(రుషికొండ)లో 33 అడుగుల ప్రతిపాదిత గ్రీన్ బెల్ట్‌ను తొలగించాలి.
- మధురవాడ సర్వే నెంబర్ 374/1, ఎల్‌పీ నెంబర్ 74/88 లో ప్రతిపాదిత 60 అడుగులు రహదారి స్థానంలో 40 అడుగుల రహదారిని కొనసాగించాలి.
- హనుమంతువాక నుంచి జోడుగుళ్లపాలెం వరకు ప్రతిపాదిత 100 అడుగుల రహదారిని 60 అడుగులకు పరిమితం చేయాలి.
- అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు నుంచి రైల్వే న్యూ కాలనీ వరకు గల ప్రతిపాదిత 100 అడుగుల రహదారిని 60 అడుగులకు కుదించాలి.
- సర్వే నెంబర్ 76/5 గుడిలోవ పరిధిని ఎకో జోన్ నుంచి నివాస జోన్‌గా మార్పు చేయాలి.
- లంకెలపాలెం నుంచి షీలానగర్ వరకు ప్రతిపాదించిన 80మీ రహదారి స్థానంలో 60 మీ రహదారిని కొనసాగించాలి.
- స్థానిక భూలోకమాత ఆలయం వద్ద రహదారి విస్తరణ ప్రతిపాదనను విరమించుకోవాలి.
- విజయనగరం, వీటీ అగ్రహారం, సర్వే నెంబర్ 115, 116 మీదుగా ప్రతిపాదించిన 60 అడుగుల రహదారి తొలగించాలి.
- మధురవాడ వైజాగ్ కన్వెన్షన్ సెంటర్ పక్కన ప్రస్తుతమున్న 60 అడుగుల రహదారిని 100 అడుగుల వెడల్పు రహదారిగా చేసిన ప్రతిపాదనలను పునఃపరిశీలించాలి.

ప్రజలకు ఇబ్బంది లేకుండా మెట్రో స్టేషన్లు

- ప్రభుత్వ స్థలాలనే ఉపయోగించాలి
- భూసేకరణపై ప్రజాభిప్రాయంలో పలువురి సూచనలు



ప్రజాభిప్రాయసేకరణలో ప్రసంగిస్తున్న ఎస్‌డీసీ సుధాసాగర్

గాజువాక: నగరంలో చేపట్టనున్న మెట్రో రైలు ప్రాజక్టు నిర్మాణం కోసం భూసేకరణలో భూమి కోల్పోయినవారికి ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు పేర్కొన్నారు. మొదటి దశలో చేపట్టనున్న భూసేకరణపై బుధవారం గాజువాకలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్రో ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధాసాగర్ మాట్లాడుతూ కూర్మన్నపాలెం నుంచి కొమ్మాది వరకు మెట్రో ప్రాజెక్టు కోసం 97 ఎకరాల భూమి అవసరమవుతుందన్నారు. ఇందులో 87 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఇంకా 9.22 ఎకరాలను పట్టా భూమి నుంచి సేకరించాల్సి ఉందన్నారు. ఈ సేకరణలో 312 ఇళ్లు, వ్యాపార సంస్థలు, ఖాళీస్థలాలకు నష్టం జరుగుతుందన్నారు. కారిడార్–1లో 94 నివాస, వ్యాపార, ఖాళీ స్థలాలకు కొద్ది గాను, 20 ఇళ్లకు పూర్తి గానూ నష్టం జరుగుతుందన్నారు. వారికి 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్ట పరిహారం అందజేస్తామన్నారు. అలాగే గాజువాక, గోపాలపట్నం, గురుద్వారా, సంపత్ వినాయకనగర్, పూర్ణామార్కెట్, మధురవాడ ప్రాంతాల్లో అభిప్రాయ సేకరణ సదస్సులు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కాగా..నిర్వాసితులు స్టేషన్ పాయింట్లపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ప్రతి కిలోమీటర్‌కు ఒక స్టేషన్ కాకుండా స్టేషన్‌కు, స్టేషన్‌కు మధ్య రెండు కిలోమీటర్లకు పైన దూరం ఉండేటట్టు చూడా లని కోరారు. మెట్రో స్టేషన్లను ప్రైవేట్ స్థలాల్లో కాకుండా ప్రభుత్వ స్థలాలున్న చోట ఏర్పాటు చేయాలని సూచించారు. దీని వల్ల ప్రభుత్వానికి వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. అభ్యంతరాలను రికార్డు చేసిన ఎస్‌డీసీ వాటిని కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, తహసీల్దార్ బి.శ్రీనివాసరావు, మెట్రో నిపుణులు దేవరాజు, మాధవరెడ్డి, మెట్రో డిప్యూటీ తహసీల్దార్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్

విశాఖ సిటీ: అభ్యంతరం కాని అనధికారిక ఆక్రమణలు, నివాసయోగ్యమైన కట్టడాల క్రమబద్ధీకరణపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వేర్వేరుగా విశాఖ, భీమిలి రెవెన్యూ డివిజన్ల అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 30 గురించి ప్రజలు తెలియజేయాలని సూచించారు. 2019 అక్టోబర్ 15కు ముందు జరిగిన ఆక్రమణలను పరిగణలోకి తీసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. సచివాలయాల వారీగా జాబితాలను ప్రచురించాలని సూచించారు. రెవెన్యూ సదస్సులు, పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన వినతుల పరిష్కారంపై చొరవ చూపాలన్నారు. రీ సర్వే, మ్యుటేషన్ల ప్రక్రియలో పారదర్శకత లోపించకుండా పనిచేయాలన్నారు. కోర్టు కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత సమయంలో కౌంటర్లు దాఖలు చేయాలని చెప్పారు. డీఆర్వో భవానీశంకర్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్, సర్వే శాఖ ఏడీ సూర్యారావు, ఏవో ఈశ్వరరావు పాల్గొన్నారు.




ఈ ఫొటో సర్కిల్‌లో ఉన్నది అక్రమ మైనింగ్ డాన్‌గా పేరొందిన వెంగమాంబ క్రషర్స్ అధినేత శ్రీనివాస్ చౌదరి. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌తో పాటు జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఎంపీ అండతో అనుమతి లేని లీజులో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు.



ఈ ఫొటోలో ఉన్నది వెంగమాంబ క్రషర్స్, అనకాపల్లి మండలం సీతానగరం గ్రామ పరిధిలోని సర్వే నంబరు 251లో అక్రమ మైనింగ్ ఫిర్యాదుతో మూతపడింది. లీజు గడువు కూడా ముగిసింది. అనుమతి లేనప్పటికీ ఇక్కడ ప్రతి రోజూ మైనింగ్ కార్యకలాపాలు నడుస్తున్నాయి.



అనకాపల్లి జిల్లా మైనింగ్ శాఖ అధికారుల ప్రకారం ఈ మైనింగ్ నాన్–వర్కింగ్. రికార్డుల్లో పనిచేయడం లేదని ఉన్నప్పటికీ వాస్తవంలో మాత్రం లారీలకు లారీలు మెటీరియల్ తరలిపోతోంది.



వెంగమాంబ క్రషర్స్‌లో సాగుతున్న కార్యకలాపాలు

వెంగమాంబ అక్రమాలకు మైనింగ్ గులాం!

- అనుమతి లేకున్నా ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- భారీ ట్రక్కులతో మెటీరియల్ తరలింపు
- రోడ్డు మెటల్‌తోపాటు భారీ బోల్డర్లూ రవాణా
- చేష్టలుడిగి చూస్తున్న మైనింగ్ అధికారులు
- ఎంపీ సీఎం రమేష్ అండదండలతో రెచ్చిపోతున్న లీజుదారు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అనకాపల్లి మండలం సీతానగరం గ్రామంలోని వెంగమాంబ క్వారీలో లీజులు రద్దయినప్పటికీ ప్రతి రోజూ తవ్వకాలు మాత్రం యథేచ్ఛగా జరుగుతున్నాయి. ట్రక్కుల్లో మెటీరియల్ తరలిపోతోంది. రోడ్డు మెటల్‌తోపాటు భారీ బోల్డర్లను కూడా ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. అక్రమ మైనింగ్ ఫిర్యాదుతో రూ.33 కోట్ల జరిమానా విధించినప్పటికీ... పైసా చెల్లించకుండా అనుమతి లేకుండా కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. ఈ వ్యవహారం వైపు మైనింగ్‌శాఖ అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. రవాణా, రెవెన్యూ అధికారులు కూడా అక్రమ మైనింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు.

అక్రమ మైనింగ్ పేరుతో భారీ జరిమానా...!

వాస్తవానికి జీఎస్‌ఎన్ శ్రీనివాస్ అనే వ్యక్తి సీతానగరం గ్రామ పరిధిలో సర్వే నెంబరు 251లో రెండు లీజులు తీసుకున్నారు. మొదటి లీజులో 4 హెక్టార్లు, రెండో లీజులో 1 హెక్టార్ తీసుకున్నారు. ఈ రెండు లీజుల్లోనూ రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ ఉందని పేర్కొన్నారు. ఈ రెండింటిలో ఒకదాని లీజు గడువు 2023 మే నాటికి ముగియగా... మరో లీజు గడువు ఫిబ్రవరి 2022 నాటికి ముగిసింది. మైనింగ్‌శాఖ రికార్డుల ప్రకారం... ఈ క్వారీ ప్రస్తుతం పనిచేయడం లేదని పేర్కొంటున్నారు. ఇవే కాకుండా వీవీఆర్ స్టోన్‌క్రషర్స్ అధినేత వెంగమాంబ శ్రీనివాస్ చౌదరికి ఇక్కడే నెం.193, 303 సర్వే నెంబర్లలో మరో రెండు లీజులు (సుమారు 3 హెక్టార్లు) ఉన్నాయి. వీటికి కూడా అనుమతి లేదు. డిమాండ్ నోటీసులు ఇచ్చారని... కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయని తెలుస్తోంది. అయినప్పటికీ 251 సర్వే నెంబరులో మాత్రం ఇష్టారాజ్యంగా మైనింగ్ నిర్వహిస్తున్నారు. వాస్తవానికి వీవీఆర్ స్టోన్‌క్రషర్స్ (వెంగమాంబ) భూమిలో ఖనిజ సంపదను అక్రమంగా దోచేసి మైనింగ్ చేయడంతో మైన్స్ శాఖ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 2020లో తనిఖీలు నిర్వహించారు. వందలాది లారీల్లో ఖనిజం తరలిపోతుందని స్థానికులు సైతం అప్పట్లో ఫిర్యాదు చేశారు. అయినా లెక్క చేయకుండా ధిక్కార ధోరణితోనే మైనింగ్ డాన్ శ్రీనివాస్ చౌదరి స్థానిక మైనింగ్ అధికారులతో చేతులు కలిపి మైనింగ్ కొనసాగించారు. వాస్తవానికి ఆయన అక్రమ మైనింగ్‌కు సహకరిస్తున్నారనే ఫిర్యాదులతో ముగ్గురు అధికారులపై బదిలీ వేటు కూడా పడింది. వెంగమాంబ స్టోన్ క్రషర్స్‌లో జరిగిన దోపిడీ అంతా ఇంతా కాదు. ఏకంగా 5 లక్షల 68 వేల 923 క్యూబిక్ మీటర్ల ఖనిజం దోపిడీ జరిగిందని మైన్స్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూడా నిర్ధారించింది. ఇందుకు రూ.32.36 కోట్ల మేర జరిమానా విధించారు.

ఇక్కడ రిగ్ బ్లాస్టింగ్, తీసుకున్న అనుమతికి మించి అక్రమంగా తవ్వకాలు చేపట్టడం జరుగుతోందంటూ విజిలెన్స్ తనిఖీల్లో తేలింది. ఏకంగా ప్రభుత్వ ఖజానాకు రూ.100 కోట్ల మేర నష్టం వాటిల్లేలా కంపెనీ వ్యవహరించిందని కూడా పేర్కొన్నారు. అంతేకాకుండా తనకు రూ.3 కోట్ల మేర లంచం ఇచ్చేందుకు సదరు వెంగమాంబ యజమాని శ్రీనివాస్ ప్రయత్నించాడని కూడా అప్పట్లో విజిలెన్స్ మైనింగ్ అధికారి ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు.

కూటమిలో చేరికతో....!

ఎన్నికల ముందు సదరు మైనింగ్ లీజుదారుడు శ్రీనివాస్ కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలో చేరారు. అనకాపల్లి ఎంపీగా పోటీ చేసిన సీఎం రమేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇప్పుడు కూడా ఆయనతోపాటు కలిసి నడుస్తున్నారు. ఎలాగూ ఉన్నది కూటమి ప్రభుత్వమే కదా అనే దన్నుతో లీజు గడువు ముగిసినప్పటికీ... అనుమతి లేనప్పటికీ ఇష్టారాజ్యంగా మైనింగ్ చేపడుతున్నారు. రోడ్డు మెటల్‌తో పాటు బోల్డర్లను కూడా తరలిస్తున్నారు. పట్టపగలు ఈ వ్యవహారం నడుస్తున్నప్పటికీ మైనింగ్‌శాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అధికారంలో ఉన్నది తామేనని... తమను ఎవ్వరూ అడ్డుకోలేరంటూ ఇష్టారాజ్యంగా మైనింగ్ వ్యవహారం నడుస్తోంది. ప్రభుత్వ ఖజానాకు రూ.100 కోట్ల నష్టం వాటిల్లిందని... రూ.33 కోట్ల జరిమానా విధించిన తర్వాత పైసా కూడా చెల్లించకపోయినప్పటికీ.. అక్రమ మైనింగ్ చేపడుతున్నప్పటికీ.. చేష్టలుడిగి చూడటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

డాక్టర్ నిఖితకు గోల్డ్‌మెడల్



రాష్ట్రపతి చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ నిఖిత

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని నిఖిత హాస్పిటల్ వైద్యులు కె.రమేష్ నాయుడు, సునందరాణిల కుమార్తె డాక్టర్ నిఖిత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఏఐఐఎంఎస్ ఢిల్లీలో ఆబ్స్ట్రెట్రిక్స్, గైనకాలజీలో పీజీ చేస్తున్న నిఖిత ఏఐఐఎంస్ భువనేశ్వర్ 5వ స్నాతకోత్సవంలో ఈ ఘనత సాధించారు.

నేడు, రేపు ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన

విశాఖ సిటీ: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ ఈ నెల 17, 18 తేదీల్లో విశాఖలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు హెచ్‌పీసీఎల్ అతిథి గృహం నుంచి బయలుదేరి మింది ప్రాంతంలోని బీహెచ్ఎల్ ప్లాంట్‌ను సందర్శిస్తారు. అక్కడ ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు అనకాపల్లి కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షిస్తారు. రాత్రికి హెచ్‌పీసీఎల్ అతిథి గృహంలో బస చేస్తారు. 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు హెచ్‌పీసీఎల్ రిఫైనరీ ప్లాంట్‌ను సందర్శించి అక్కడి సీనియర్ అధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ కలెక్టరేట్‌లో కలెక్టర్, సీపీ, అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహిస్తారు. 19వ తేదీ సాయంత్రం ఆయన విమానంలో ఢిల్లీకి పయనమవుతారు.

23న ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

కంచరపాలెం : నరవ/గడుగుపల్లి ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి 23న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి తెలిపారు. 20న వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్, 22న సర్టిఫికెట్‌లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9491813637 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి 'డీసెట్' ధ్రువీకరణ పత్రాల పరిశీలన

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో గురువారం నుంచి 22వ తేదీ వరకు 'డీసెట్'లో ర్యాంకులు సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ బుధవారం తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువీకరణ పరిశీలన జరుగుతుంది. అర్హులైన అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీల్లో ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు, ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని ఆయన సూచించారు.

మరో ఇద్దరు కంబోడియా ఏజెంట్లు అరెస్ట్

- డేటా ఎంట్రీ జాబ్ పేరుతో నలుగురిని కంబోడియా పంపించాలని ప్రయత్నం
- ఎయిర్‌పోర్టు వద్ద ఏజెంట్లు సురేష్, ఆదిలక్ష్మిల అరెస్ట్
- విదేశాల్లో ఉద్యోగం పేరుతో నిరుద్యోగులతో సైబర్ నేరాలు చేయిస్తున్న గ్యాంగ్
- మీడియాతో పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



ఏజెంట్ల నుంచి రక్షించిన బాధితులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ : విదేశాల్లో ఉద్యోగం.. ఏసీ రూమ్‌లో డేటా ఎంట్రీ పని.. పెద్దగా విద్యార్హతలు లేకపోయినా రూ.లక్షల్లో జీతమని నిరుద్యోగులకు ఆశ కల్పించారు. అది నమ్మి విమానం ఎక్కిన నిరుద్యోగులతో కంబోడియాలో బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్నారు. మాట వినని వారికి తిండి పెట్టకుండా దాడులకు దిగుతున్నారు. ఇప్పటివరకు కంబోడియా, మయన్మార్‌లో సైబర్ గ్యాంగ్ చేతుల్లో చిక్కుకున్న 85 మంది అమాయకులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సురక్షితంగా స్వదేశానికి రప్పించారు. 9 కేసుల్లో 22 మందిని అరెస్టు చేశారు. తాజాగా గాజువాకకు చెందిన మరో ఇద్దరు ఏజెంట్లు నలుగురు నిరుద్యోగులను కంబోడియా పంపించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఎయిర్‌పోర్టు వద్ద పట్టుకున్నారు. బుధవారం పోలీస్ సమావేశ మందిరంలో సీపీ శంఖబ్రత బాగ్చి కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు.

కంబోడియా నుంచి వచ్చి ఏజెంట్‌గా మారి..

గాజువాకకు చెందిన సురేష్, ఆదిలక్ష్మిలు కంబోడియాలో చైనా ఆధారిత సైబర్ స్కామ్ కంపెనీలకు నిరుద్యోగులను పంపించి భారీగా కమీషన్ సంపాదించాలని భావించారు. సురేష్ గతంలో కంబోడియాకు వెళ్లి అక్కడ చైనా స్కామ్ కంపెనీలో పనిచేశాడు. అలాగే అక్కడ విజయ్‌కుమార్ అలియాస్ సన్నీ అనే వ్యక్తితో పరిచయం పెంచుకున్నాడు. ఇటీవలే భారత్‌కు వచ్చి సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కంబోడియాలో చైనా సైబర్ స్కామ్ కంపెనీకి ఏజెంట్‌గా మారాడు. విజయ్‌కుమార్ సూచనలతో ఆదిలక్ష్మి అలియాస్ అను సాయంతో విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మాయమాటలు చెప్పి ఇప్పటి వరకు 12 మందిని కంబోడియాకు పంపించాడు. తాజాగా మరో నలుగురు నిరుద్యోగులను కంబోడియాకు పంపించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో విశాఖ ఎయిర్‌పోర్టు వద్ద ఏజెంట్లు సురేష్, ఆదిలక్ష్మిలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.50 వేల నగదు, 2 వేల డాలర్లు(రూ.1.8 లక్షలు), 20 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కంబోడియాలో చైనా స్కామ్ కంపెనీలకు ప్రధాన ఏజెంట్‌గా విజయ్‌కుమార్ అలియాస్ సన్నీ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతడు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి తెలుగువారిని టార్గెట్ చేసి ఏజెంట్ల ద్వారా కంబోడియాకు రప్పిస్తున్నట్లు విచారణలో బయటపడిందని సీపీ తెలిపారు.

కంబోడియాలో 500 మంది ఉత్తరాంధ్రవాసులు

మయన్మార్, కంబోడియాలో విజిటింగ్ వీసాలపై ఉత్తరాంధ్ర నుంచి 500 మంది వరకు ఉన్నట్లు చెప్పారు. వీరిలో కొందరు ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోయిన వారు కాగా.. మరికొందరు సైబర్ నేరాలు చేయాలన్న ఉద్దేశంతోనే వెళ్లినట్లు తెలుస్తోందన్నారు. వారే అక్కడ ఏజెంట్లుగా మారి భారత్ నుంచి నిరుద్యోగ యువతను సైబర్ నేరాల కోసం తీసుకువెళుతున్నట్లు గుర్తించామన్నారు. కంబోడియా, మయన్మార్, బ్యాంకాక్‌లో చైనా సంబంధిత స్కామ్ కంపెనీల్లో పనిచేస్తున్న వారు ఎవరైనా ఉంటే వారి కుటుంబ సభ్యులు ఆ కంపెనీ వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. నగరంలో నకిలీ రిక్రూట్‌మెంట్ ఏజెంట్లు/కన్సల్టెన్సీల ద్వారా ఎవరైనా మోసపోయినా, ఎవరైనా విదేశాల్లో చిక్కుకుపోయినా, సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో గానీ, 7995095799 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. వాటిపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

డ్రగ్స్ కేసులో ఆరుగురు అనుమానితులపై నిఘా

కొకైన్ కేసులో ఆరుగురు పాత్రపై విచారణ చేపడుతున్నట్లు సీపీ తెలిపారు. ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేయగా.. ఇద్దరిపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. వీరి ద్వారా మరో నలుగురి పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు వెల్లడించారు. వీరిపై లోతుగా దర్యాప్తు జరుగుతోందని, వారి కాల్ డేటా, ఇతర సాంకేతికాంశాలను విశ్లేషిస్తున్నట్లు వివరించారు. పూర్తి స్థాయిలో ఆధారాలు లభించిన వెంటనే వారిని అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు. గాజువాకలో యువకుడిపై తలపై బీరు బాటిల్‌తో కొట్టిన కేసులో నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. ఒకరు పరారీలో ఉన్నారని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు.

రౌడీషీటర్ ఆత్మహత్య

- అప్పుల వేధింపులే కారణమా?
- గుణశేఖర్ మృతిపై అనుమానాలు



గుణశేఖర్ మృతదేహం, రౌడీషీటర్ గుణశేఖర్(ఫైల్)

మద్దిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్న కోలాటి గుణశేఖర్ (28) తన గదిలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఈ ఘటన అనేక అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. తుమ్మడిపాలెంలో రౌడీషీటర్ గుణశేఖర్, పిడుగు వసంత అనే ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. వీరిద్దరిపైనా రౌడీషీట్ ఉంది. ఇదివరకు ఆటో నడుపుతూ జీవనం సాగించిన గుణశేఖర్, ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. మద్యానికి బానిసై, భారీగా అప్పులు చేసినట్లు సమాచారం. దీంతో అప్పుల వాళ్లు తరచూ వీరి ఇంటికి వచ్చి డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేసేవారు. మంగళవారం రాత్రి గుణశేఖర్, వసంత మాట్లాడుకుంటుండగా, అప్పుల వాళ్లు రావడంతో వారి మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తోంది. ఈ వాగ్వాదం తర్వాత గుణశేఖర్ వేరే గదిలోకి వెళ్లిపోయాడు. కొంతసేపటి తర్వాత గదిలో నుంచి శబ్దం రావడంతో వసంత వెళ్లి చూడగా, గదికి లోపల నుంచి గడియ పెట్టి ఉంది. ఇరుగుపొరుగు వారి సహాయంతో గడియ తీసి చూడగా, గుణశేఖర్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే అతడిని కిందకు దించి 108కి ఫోన్ చేయగా, సిబ్బంది వచ్చి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బుధవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఇద్దరిపైనా రౌడీషీట్ ఉండటం, మృతుడికి అప్పులు ఉండటం, వారిద్దరి మధ్య గొడవ జరగడంతో ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగా అప్పుల వల్ల వాగ్వాదం జరిగిందా, లేక వారిద్దరి మధ్య ఇతరత్రా గొడవలు ఉన్నాయా, మృతికి గల అసలు కారణాలు ఏమిటనేది తెలియాల్సి ఉంది. అయితే అప్పుల వాళ్లు పదే పదే ఇంటికి వచ్చి ఒత్తిడి చేయడంతోనే వీరి మధ్య గొడవ జరిగిందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.రవికుమార్ తెలిపారు.

లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి మూడేళ్ల జైలు

విశాఖ లీగల్: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి పి.మంగాకుమారి బుధవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. బాలికకు ప్రభుత్వం రూ.1.25 లక్షల పరిహారం చెల్లించాలని కూడా ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిన రాజశేఖర్ అందించిన వివరాలివి. నిందితుడు ఇందాన సూర్యప్రకాష్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చల్లకొండవారి వీధిలో నివాసం ఉండేవాడు. నగరంలోని ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదివేవాడు. బాధిత బాలిక నిందితుడి ఇంటికి సమీపంలోనే ఉండేది. బాలిక తండ్రి తాపీ మేస్త్రీ కాగా, తల్లి గృహిణి. వారికి ఇద్దరు పిల్లలున్నారు. చిన్నారి ఒక ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదివేది. కరోనా సమయంలో పిల్లలు ఇంటి వద్దనే ఉంటూ ఆన్‌లైన్ తరగతులకు హాజరయ్యేవారు. 2021 జూలై నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో పిల్లలు స్కూల్‌కు వెళ్లడం మొదలుపెట్టారు. అయితే, 2021 ఆగస్టులో పాఠశాలలకు సెలవులు రావడంతో చిన్నారి ఇంట్లోనే ఆడుకుంటోంది. ఇదే అదనుగా భావించిన నిందితుడు, ఎవరూ లేని సమయంలో చిన్నారిని తన ఇంటికి పిలిచి, చాక్లెట్లు ఇస్తానని మభ్యపెట్టి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తీవ్రమైన కడుపునొప్పితో బాధపడటంతో తల్లిదండ్రులు ఆమెను ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్య పరీక్షలు చేసిన అనంతరం బాలిక లైంగిక దాడికి గురైనట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆమె తల్లి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఎస్.శిరీష కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

బస్‌స్టేషన్లలో సౌకర్యాలు పెంచాలి

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



ఎంవీపీ బస్‌స్టేషన్‌లో సదుపాయాలపై ఆరా తీస్తున్న ఎండీ ద్వారకా తిరుమలరావు

ఎంవీపీకాలనీ: రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్‌స్టేషన్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం పలు బస్‌స్టేషన్లతో పాటు ఆర్టీసీ డిస్పెన్సరీలను సందర్శించారు. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీ బస్‌స్టేషన్‌ను, ఉద్యోగులకు వైద్య సేవలు అందిస్తున్న డిస్పెన్సరీని పరిశీలించారు. డిస్పెన్సరీ ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, వసతులు, జరుగుతున్న వైద్య చికిత్సలపై ఆరా తీశారు. వైద్య సేవలు పొందుతున్న వారితో మాట్లాడి సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డిస్పెన్సరీల ద్వారా ఉద్యోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్నారు. వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఇందుకు అవసరమైన నివేదికలు సిద్ధం చేసి తన కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. ఎంవీపీ బస్‌స్టేషన్‌ను మరింత శుభ్రంగా నిర్వహించాలని ఆదేశించిన ఆయన.. రాష్ట్రంలోని దిగువ స్థాయి బస్‌స్టేషన్లలో మౌలిక సదుపాయాలు పెంచాలన్నారు. ఇందుకు అనుగుణంగా అవసరమైన కార్యాచరణను రూపొందించాలని ఆదేశించారు. సంస్థ డైరెక్టర్ కేఎస్‌బీ రెడ్డి, విశాఖ రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ సీటీఎంలు సత్యనారాయణ, పద్మావతి, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు వాణి నీలిమం, ఆశాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి వెంకట రమణ. చిత్రంలో న్యాయమూర్తులు

విశాఖ లీగల్: మధ్య వర్తిత్వంతో కేసుల రాజీ సులభతరమవుతుందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.వెంకటరమణ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం వన్ కే వాక్‌థాన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వివిధ న్యాయస్థానాల్లో ఉన్న కేసులకు సత్వర పరిష్కారం చూపే విధంగా మధ్యవర్తిత్వ విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. న్యాయ సేవల ప్రచార కార్యక్రమంలో భాగంగా 'దేశం కోసం-మధ్యవర్తిత్వం'అనే అంశంపై అవగాహన కల్పించేందుకు వాక్‌థాన్‌ని ఏర్పాటు చేసినట్లు సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, విశాఖ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, శిక్షణ పొందిన మధ్యవర్తులు, పారా న్యాయ సహాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాష్ట్ర బార్ కౌన్సిల్ ప్రతినిధులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో ఉత్కంఠగా మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న పలు విభాగాల సిబ్బంది

గోపాలపట్నం: విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం మాక్‌డ్రిల్ జరిగింది. ఎయిర్‌పోర్టులోని బే-8 సమీపంలో ప్రమాదం జరిగిందనే సమాచారంతో మాక్‌డ్రిల్ ప్రారంభమైంది. దట్టమైన పొగలు అలుముకోవడంతో హెచ్చరికల గంట మోగింది. క్షణాల్లో సైరన్ల హోరుతో అగ్నిమాపక శకటాలు, అంబులెన్సులు, సహాయక బృందాలు సంఘటనా స్థలానికి దూసుకొచ్చాయి. పలు విభాగాల సమన్వయంతో పొగల్లో చిక్కుకున్న ప్రయాణికులను రక్షించడం, గాయపడిన వారికి తక్షణమే ప్రథమ చికిత్స అందించడం, ఆందోళనలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్. పురుషోత్తం మాట్లాడుతూ.. ఇలాంటి మాక్ డ్రిల్స్ నిర్వహించడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో మన స్పందన సామర్థ్యం మెరుగుపడుతుందన్నారు. విపత్కర సమయాల్లో ప్రయాణికులను ఎలా కాపాడాలనే దానిపై సిబ్బందికి పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. ఈ మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న భారత నౌకాదళం(ఐఎన్ఎస్ డేగా), ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, సీఐఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, రాష్ట్ర పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక విభాగాలు, జీవీఎంసీ, వైద్య ఆరోగ్య అధికారులు, ఇండిగో, ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఇండియా వన్ ఎయిర్ విమానయాన సంస్థల సిబ్బంది, గ్రౌండ్ హ్యాండ్లింగ్ ఏజెన్సీలు, అపోలో ఆసుపత్రి వైద్య సిబ్బంది, సివిల్ డిఫెన్స్ సిబ్బందికి డైరెక్టర్ పురుషోత్తం కృతజ్ఞతలు తెలిపారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికేట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

అప్పన్న దేవస్థానానికి రూ.2.95 కోట్ల ఆదాయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో లీజు హక్కులు ఇచ్చేందుకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలు, షీల్డ్ టెండర్ల ద్వారా దేవస్థానానికి ఏడాదికి రూ.2 కోట్ల 95 లక్షల 58 వేల ఆదాయం లభించింది. సింహగిరిపై భక్తులకు కొబ్బరికాయలు విక్రయం జరిపేందుకు రూ.32.60 లక్షలు, కొబ్బరికాయలు, పూజాసామగ్రి విక్రయానికి రూ.72 లక్షలు, కొండపై రాజగోపురం ఎదురుగా పోలరాయిడ్ ఫొటోస్ తీసుకునేందుకు రూ.32.90 లక్షలు, భక్తుల పాదరక్షలు భద్రపరిచేందుకు రూ.35.01 లక్షలు, భక్తులు కొట్టిన కొబ్బరి చెక్కలు తీసుకునేందుకు రూ.91.91 లక్షలు, భక్తులు స్వామికి సమర్పించే పాలు, నెయ్యి, బెల్లం, ఒడిబియ్యం తదితరాలు తీసుకునేందుకు రూ.5.59 లక్షలు, కొండదిగువ గురువారం సంతలో ఆశీలు వసూలుకు రూ.1.13 లక్షలు, గోపాలపట్నంలో బుధవారం సంత ఆశీసులు వసూళ్లకు రూ.2.50 లక్షలు, వరాహ పుష్కరిణి గట్టుపై కొబ్బరికాయలు, పూజాసామాగ్రి విక్రయానికి రూ.5.50 లక్షలు, స్వామివారి ఉపాలయాలు పైడితల్లి, బంగారమ్మ ఆలయం వద్దభక్తులు సమర్పించిన చీరలు, కొబ్బరి ముక్కలు తీసుకునేందుకు రూ.5.07 లక్షలుకు పాట వెళ్లింది. వీటితో పాటు దేవస్థానం పరిధిలోని దుకాణాలను అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకూ వేలంపాటలు నిర్వహించారు. కొండదిగువ పాత గోశాల వద్ద మామిడి, జీడి ఫలసాయం తీసుకునేందుకు ఏడాదికి రూ.66 వేల హెచ్చు మొత్తానికి పాటదారు పాడుకున్నారు. కొండపై డెకరేషన్ మండపాల నిర్వహణ, కొండదిగువ క్యాంటీన్-1 వేలం పాటలను వాయిదా వేశారు. పెందుర్తిలోని సర్వే నెం.269లో 79 సెంట్ల వ్యవసాయ భూమిలో సాగు నిమిత్తం లీజుకిచ్చే అంశం కూడా వాయుదా పడింది. దేవస్థానం ఏఈవోలు పి.జగ్గారావు, నరసింహరాజు, సూపరింటెండెంట్లు పాలూరి నరసింగరావు, బి.శ్రీనివాసరావు తదితరులు వేలం ప్రక్రియను నిర్వహించారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు అవమానం

కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను పరామర్శించిన జల్లిపల్లి సుభద్ర



కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను పరామర్శిస్తున్న విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

విశాఖ సిటీ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు గౌరవం లభిస్తే.. కూటమి ప్రభుత్వంలో దాడులు, అఘాయిత్యాలతో తీవ్ర అవమానం ఎదుర్కొంటున్నారని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆరోపించారు. ఇటీవల బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమానికి వెళ్తున్న కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై కూటమి నాయకులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్లతో పాటు విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ సుభ్రద కూడా కృష్ణా జిల్లా పెడనలోని ఉప్పాల హారిక స్వగృహంలో ఆమెను పరామర్శించారు. తామంతా అండగా ఉంటామని భరోసా కల్పించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళలను గౌరవించలేని సమాజంలో అభివృద్ధి సాధ్యం కాదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలు తీవ్ర అవమానాలు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక చోట దాడులు జరుగుతూనే ఉన్నాయని చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఉప్పాల హారికపై చంద్రబాబే దాడి చేయించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ప్రోద్బలంతోనే కూటమి నాయకులు హారికపై, ఆమె కాన్వాయ్‌పై దాడికి తెగబడ్డారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన సీఎం దాడులు చేయిస్తూ ఉండడం అన్యాయమన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలిపైనే దాడి జరిగితే, ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. దీనిని తామంతా తీవ్రంగా ఖండిస్తున్నామని, న్యాయపరమైన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

మబ్బుల ఛత్రం.. భిన్న చిత్రం!





వేసవిని మించిన ఎండలతో బుధవారం నగరం ఉక్కిరిబిక్కిరైంది. ఇంట్లోంచి ప్రజలు బయటకు రావాలంటేనే భయపడేలా ఎండ తీవ్రత ఉంది. ఇక స్కూలు పిల్లల కష్టాలు వర్ణనాతీతం. మధ్యాహ్నం బడి నుంచి ఇళ్లకు వచ్చే చిన్నారులు గొడుగులు వేసుకోవాల్సి వచ్చింది. అయితే సాయంత్రానికి కాస్త ఊరట లభించింది. మండుతున్న ఎండలకు అడ్డుకట్ట వేస్తూ.. మబ్బులు నగరానికి ఛత్రం పట్టాయి. నగరంలో బుధవారం కనిపించిన భిన్న దృశ్యాలివి..

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తీరానికి పెనుముప్పు







నగరంలోని మురుగునీరు సముద్రంలో కలవకుండా భారీ సిమెంట్ పైపులను ఏర్పాటు చేసేందుకు గత నెలలో పనులు ప్రారంభించారు. తీరంలో పలు ప్రాంతాల్లో నిర్మించిన ఈ పైపుల చుట్టూ ఉన్న ఇసుక భారీగా కోతకు గురైంది. దీంతో పైపులు విడిపోయి నిరుపయోగంగా మారాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైంది. పాండురంగాపురం నుంచి వైఎంసీఏ వరకు వివిధ ప్రాంతాల్లో ఈ పైపులు నిర్మించిన చోట తీవ్ర కోత ఏర్పడింది. కోట్లాది రూపాయలు వెచ్చించి ఇటీవల డ్రెడ్జింగ్ నిర్వహించినప్పటికీ.. అనాలోచితంగా చేస్తున్న పనులు, నిపుణుల సూచనలు, పర్యవేక్షణ లేకుండా జరుపుతున్న నిర్మాణాలు తీరానికి తీరని నష్టం కలిగిస్తున్నాయని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం